జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
## భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం | 10 | ఏప్రిల్ | 2026 ◆ పేజీలు : 8



# విద్యార్థులకు యూనిఫామ్ ల పంపిణీ

- విద్యార్థుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధా న్యత ఇస్తోంది
- ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను విద్యా ర్థులు సద్వినియోగం చేసుకోవాలి
- విద్యార్థులు పొందు తున్న సాంకేతిక విద్యపై వివరాలు అడిగి తెలుసు కున్న ఎమ్మెల్యే పాయం



**మణుగూరు, ఏప్రిల్ 09, (ప్రజా జ్యోతి) :** ప్రజాపాలన 99 రోజుల ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం మండల పరిధి లోని గవర్నమెంట్ ఐటీఐ, ఏటీసీలో విద్యార్థులకు మిగతా 2 లో...




## రెవెన్యూ శాఖ అధికారి తీరుపై...
# తీవ్ర విమర్శలు

6 లో..

- అక్రమ మట్టిదందాలో రెవెన్యూశాఖ పాత్రపై అనుమానాలు..!
- నిజం చెప్పినందుకు మహిళ అధికారికి నోటీసుల బెదిరింపులా..?
- రెవెన్యూశాఖే అక్రమాలకు అడ్డాగా మారుతుందా..?
- మట్టిదందాలపై తహసీల్దార్, జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి చేపట్టాల్సిందే
- రెవిన్యూ శాఖ అధికారి తీరుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

లక్ష్మీదేవిపల్లి మండలం పరిధిలోని ఉమ్మడి చాతకొండ గ్రామపంచాయతీలో అక్రమ మట్టి తవ్వకాల వ్యవహారం తీవ్ర వివాదానికి దారితీస్తోంది. సరైన అనుమతులు లేకుండానే జేసీబీతో మట్టి తొలకలు జరుగుతున్నాయని సమాచారం అందించినప్పటికి సంబంధిత రెవెన్యూ శాఖ అధికారి స్పందించకపోవడంపై స్థానికులు తీవ్ర విమర్శలు వ్యక్తం చేస్తున్నారు.

● కొత్తగూడెం, ప్రజాజ్యోతి



# ఏప్రిల్ 13 నుండి 18 వరకు "అరైవ్ అలైవ్" కార్యక్రమం

## సీఎస్ రామకృష్ణ

- రహదారి ప్రమాదాల నియంత్రణకు సమన్వయంతో చర్యలు : డీజీపీ శివధర్ రెడ్డి

**కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 9 ,(ప్రజాజ్యోతి)** హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, డీజీపీ శివధర్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించి, ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల కార్యాచరణలో "అరైవ్ అలైవ్" కార్యక్రమాన్ని ఈనెల 13నుండి 18 వరకు నిర్వహించడంపై సమీక్షించారు.ఈ సందర్భంగా సీఎస్ రామకృష్ణ మాట్లాడుతూ రవాణా శాఖ, హోం శాఖలు సంయుక్తంగా ఈ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. దేశంలో రహదారి ప్రమాదాలు అధికంగా ఉండటం వల్ల చెడు పేరు వస్తోందని, రాష్ట్రంలో రోజుకు సుమారు 20 మంది రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. ఈ ప్రమాదాలను తగ్గించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు.డీజీపీ శివధర్ రెడ్డి మాట్లాడుతూ మిగతా 2 లో...

# భద్రగిరి మార్ట్ కు ప్రజల విశేష స్పందన

- గిరిజనులకు నేరుగా లాభాలు
- ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్




**భద్రాచలం, ఏప్రిల్ 9, ప్రజాజ్యోతి:** వినియోగదారులకు నాణ్యమైన, మన్నికైన నిత్యవసర సరుకులను అందించేందుకు ఆర్గానిక్ పంటలు పండించే రైతులు, సూక్ష్మ–చిన్న తరహా పరిశ్రమలు, స్వయం సహాయక సంఘాల మహిళలు , జీసీసీ ద్వారా అటవీ ఉత్పత్తులను సరసమైన ధరలకు అందించేందుకు భద్రగిరి మార్ట్ ను ఏర్పాటు చేసినట్లు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ తెలిపారు.గురువారం తన ఛాంబర్ నుండి భద్రగిరి మార్ట్ లో జరుగుతున్న అమ్మకాలు, కొనుగోళ్లపై వినియోగదారుల స్పందనను చరవాణి ద్వారా సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్న అనంతరం ఆయన మాట్లాడారు. గిరిజన మహిళలు, రైతులు మిగతా 2 లో...



# పొంచి ఉన్న ప్రమాదం...
## పట్టించుకోని అధికారులు

- రోడ్డు కాంట్రాక్టర్ నిర్లక్ష్యమా? మిషన్ భగీరథ పైప్ లైన్ పనుల నిర్లక్ష్యమా?
- హెచ్చరికలు లేకుండా వదిలేసిన గొయ్యి--- ప్రాణాలకు ముప్పు
- పంచాయతీ కార్యాలయం ముందే ప్రమాదం--- రోజూ రాకపోకల మధ్య నిర్లక్ష్యం

**అన్నపురెడ్డిపల్లి, ఏప్రిల్ 9, ప్రజాజ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో ఫోర్ లైన్ రోడ్డు పనులు కొనసాగుతున్నాయి. గత ప్రభుత్వ కాలంలో తాగు నీటి అవసరాల కోసం మిషన్ భగీరథ నీళ్ల కోసం రోడ్డు ఇరువైపులా పైప్ లైన్ ఏర్పాటు చేయడం జరిగింది. ప్రస్తుతం రోడ్డు విస్తరణలో భాగంగా ఆ పైప్ లైన్ రోడ్డుకు అడ్డు రావడంతో మెస్ తొలగించి పైపు లైన్ ను వెనక్కి మార్చారు. ఈ ప్రక్రియలో పైపులైన్ ను సుమారు నాలుగు అడుగుల లోతులోకి మిగతా 2 లో...



# ఏప్రిల్ 13 నుండి 18 వరకు "అరైవ్ అలైవ్" కార్యక్రమం నిర్వహణ

(మొదటి పేజీ తరువాయి...)

రహదారి భద్రత అనేది ప్రమాదాల నివారణలో కీలకమని పేర్కొన్నారు. గత సంవత్సరం నిర్వహించిన అవగాహన కార్యక్రమాల ద్వారా ప్రమాదాలు కొంత మేర తగ్గినట్లు తెలిపారు. అన్ని శాఖలు సమన్వయంతో ప్రతి రోజు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో చైతన్యం కల్పించాలని సూచించారు.కార్యక్రమం షెడ్యూల్ ప్రకారం ఈనెల 13 న గ్రామస్థాయిలో రహదారి భద్రతపై గ్రామసభలు నిర్వహించి, రహదారి భద్రత కమిటీలను ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రతి కమిటీలో 8 నుండి 9 మంది సభ్యులు ఉండి, అందులో కనీసం ముగ్గురు మహిళలు ఉండాలని సూచించారు. రహదారుల సమస్యలు, ప్రమాదాలకు కారణాలు చర్చించి, భద్రత ప్రతిజ్ఞ చేయించాలని పేర్కొన్నారు.14న అంబేద్కర్ జయంతి సందర్భంగా జిల్లా, మండల స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ఎన్జీవోలను భాగస్వామ్యం చేయాలని తెలిపారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి వాటి కారణాలను విశ్లేషించి పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు. కనీసం కొన్ని బ్లాక్‌స్పాట్లను గుర్తించి వాటిని ప్రమాదరహితంగా మార్చాలని అన్నారు.15 న చిల్డ్రన్ రోడ్ సేఫ్టీ కార్యక్రమాలు నిర్వహించి, పాఠశాలల వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులకు హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగంపై అవగాహన కల్పించాలని తెలిపారు. మైనర్ డ్రైవింగ్ వల్ల కలిగే ప్రమాదాలపై బోర్డులు ఏర్పాటు చేయాలని, సురక్షిత బస్సు ప్రయాణంపై పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. కాలనీలు, కమ్యూనిటీ హాళ్లలో అవగాహన సమావేశాలు నిర్వహించాలని తెలిపారు.

16–న సోషల్ మీడియా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ప్రభుత్వ ఉద్యోగులు రహదారి భద్రతలో ఆదర్శంగా నిలవాలని తెలిపారు. డ్రైవర్లకు



కంటి పరీక్షలు నిర్వహించి, ఆటో, లారీ, బస్సు డ్రైవర్ల లైసెన్సులు, పత్రాల తనిఖీలు చేపట్టాలని సూచించారు. 17–న గోల్డెన్ అవర్ రెస్పాన్స్ ట్రైనింగ్ కార్యక్రమాలు నిర్వహించి, పోలీసు, అంబులెన్స్ సిబ్బందికి ప్రథమ చికిత్స, బాధితుల సంరక్షణ, గోల్డెన్ అవర్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని తెలిపారు. అత్యవసర కాల్స్ (100/112) వినియోగంపై దృష్టి పెట్టాలని సూచించారు. 18–న ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కౌన్సెలింగ్ నిర్వహించి, వేగ పరిమితి బోర్డులు, లేన్ క్రమశిక్షణ, రహదారి సూచికలు ఏర్పాటు చేయాలని తెలిపారు. పాఠశాల బస్సుల భద్రత తనిఖీలు, డ్రైవర్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, పాఠశాలల వద్ద సురక్షిత జోన్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఐడీఓసీ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజుతో కలిసి పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గుర్తించిన 38 బ్లాక్ స్పాట్లను ప్రమాదరహితంగా మార్చేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

గ్రామసభలు సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించాలని, ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి స్థానికంగా చర్యలు చేపట్టాలని సూచించారు. మండల, మున్సిపల్ స్థాయిలో సమావేశాలు నిర్వహించి పూర్తి కార్యాచరణ సిద్ధం చేయాలని తెలిపారు. రహదారి భద్రతపై వినూత్న కార్యక్రమాలు చేపట్టి, కళాజాత బృందాల ద్వారా అవగాహన కల్పించాలని సూచించారు. రాత్రివేళ రహదారులపై జంతువుల సంచారం వల్ల జరిగే ప్రమాదాలను నివారించేందుకు పశుసంవర్ధక శాఖతో సమన్వయం చేసుకోవాలని చెప్పారు. అధిక ఎల్ఈడి లైట్ల వినియోగం వల్ల ప్రమాదాలు పెరుగుతున్నందున వాటిపై నియంత్రణ చర్యలు తీసుకోవాలని, రహదారుల వెంట ఉన్న అక్రమ ఫ్లెక్సీలు తొలగించాలని ఆదేశించారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా కొత్తగూడెం పోస్ట్ ఆఫీస్ సెంటర్‌లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని, పిల్లలు, తల్లిదండ్రులకు రహదారి భద్రతపై అవగాహన కల్పించాలని సూచించారు.

రహదారి భద్రత వారంలో ప్రతి ప్రభుత్వ ఉద్యోగి హెల్మెట్ ధరించడం తప్పనిసరి చేయాలని తెలిపారు. ఆటో, లారీ డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించేందుకు వైద్య శాఖ అధికారులు ప్రణాళిక సిద్ధం చేయాలని, ఆర్టీసీ ద్వారా కూడా డ్రైవర్లకు వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు.

సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసి రేపు సాయంత్రం నాటికి సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ, జిల్లాలో రహదారి భద్రతను అత్యంత ప్రాధాన్య అంశంగా తీసుకొని పోలీసు శాఖ అన్ని విభాగాలతో సమన్వయంతో చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రమాదాలకు ప్రధాన కారణాలైన అధిక వేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, హెల్మెట్ ,సీట్ బెల్ట్ వినియోగం లోపించడం వంటి అంశాలపై ప్రత్యేక డ్రైవులు నిర్వహిస్తామని చెప్పారు. "అరైవ్ అలైవ్" కార్యక్రమంలో భాగంగా ప్రతి రోజు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా అమలు చేయిస్తామని తెలిపారు.

ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, రవాణా శాఖ అధికారి వెంకటరమణ, వైద్య శాఖ అధికారి తుకారాం రాథోడ్, డిపిఓ సుధీర్, ఆర్ అండ్ బి ఈ నాగేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్లు, డి సి హెచ్ ఓ రవిబాబు, పంచాయతీరాజ్ శాఖ ఈఈ శ్రీనివాస్ సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు

## పొంచి ఉన్న ప్రమాదం... పట్టించుకోని అధికారులు






(మొదటి పేజీ తరువాయి...)

మార్చినప్పటికీ, ఏర్పడిన గొయ్యిని పూడ్చకుండా అలాగే వదిలేయడం జరిగింది. రోడ్డుకు సుమారు 23 నుంచి 24 అడుగుల దూరంలో, గ్రామ పంచాయతీ కార్యాలయం ముందే ఈ గొయ్యి ఉండటం ప్రమాదకరంగా మారింది. వారం రోజులు గడిచినా ఎలాంటి హెచ్చరిక బోర్డులు, ప్రమాద సూచికలు ఏర్పాటు చేయకపోవడం తీవ్ర నిర్లక్ష్యంగా కనిపిస్తోంది. రాత్రి సమయంలో ప్రయాణించే వారు తెలియక ఆ గొయ్యిలో పడే అవకాశం ఉంది. అలాగే పశువులు, మూగజీవులు కూడా ప్రమాదానికి గురయ్యే పరిస్థితి నెలకొంది. గ్రామ పంచాయతీ కార్యాలయం ముందే ఈ గొయ్యి ఉండి రోజూ అనేక మంది రాకపోకలు సాగుతున్నప్పటికీ ఎవరూ పట్టించుకోకపోవడం స్థానికుల్లో ఆగ్రహానికి దారి తీసింది. ఇక రోడ్డు పనులు కొనసాగుతున్నప్పటికీ దుమ్ము, ధూళి విపరీతంగా ఎగిసిపడుతూ రోడ్డు పక్కన నివసించే ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. నీటి చల్లింపు తగినంతగా లేకపోవడంతో శ్వాసకోశ సంబంధిత సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పూర్తయ్యే వరకు తరచుగా నీటి చల్లింపు పెంచాలని, దుమ్ము నియంత్రణకు కాంట్రాక్టర్లు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ పరిస్థితిపై గ్రామ ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇది రోడ్డు కాంట్రాక్టర్ నిర్లక్ష్యమా? లేక మిషన్ భగీరథ పైప్ లైన్ పనుల నిర్లక్ష్యమా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఏదైనా ప్రమాదం జరిగితే ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే స్పందించి గొయ్యిని పూడ్చి, భద్రతా చర్యలు తీసుకోవడంతో పాటు దుమ్ము నియంత్రణ చర్యలు కూడా చేపట్టాలని మండల అధికారులు, ఉన్నతాధికారులను గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## విద్యార్థులకు యూనిఫామ్ ల పంపిణీ

(మొదటి పేజీ తరువాయి...)

యూనిఫామ్ ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు యూనిఫామ్ లు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే ఇన్స్టిట్యూట్ లోని పరికరాలు, శిక్షణ సౌకర్యాలను పరిశీలించి విద్యార్థులు పొందుతున్న సాంకేతిక విద్యపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో శిక్షణ అందించడం ద్వారా విద్యార్థులకు మంచి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.... విద్యార్థుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని మంచి భవిష్యత్తు నిర్మించుకోవాలని సూచించారు. అలాగే ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు చేరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ జి. రవి, సూపరింటెండెంట్ జ్యోతి రాణి, సీనియర్ అసిస్టెంట్ సాధన, మండల అధ్యక్షులు పీరినాకి నవీన్, సమితి సింగారం సర్పంచ్ కలబోయిన మాధవరావు, ఉప సర్పంచ్ గాండ్ల సురేష్, నియోజకవర్గ యూత్ అధ్యక్షులు తరుణ్ రెడ్డి, సీఐ నాగబాబు, మాజీ సర్పంచ్ దొబ్బల వెంకటప్పయ్య, ఐఎన్ టీయూసీ రాష్ట్ర నాయకులు సామా శ్రీనివాస్ రెడ్డి, గణేష్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## భద్రగిరి మార్ట్ కు ప్రజల విశేష స్పందన

(మొదటి పేజీ తరువాయి...)

మరియు అటవీ ఉత్పత్తులు మధ్య దళారుల పాలవకుండా నేరుగా భద్రగిరి మార్ట్ కు సరఫరా అయ్యే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని తెలిపారు.ప్రస్తుతం వినియోగదారుల స్పందన చాలా సానుకూలంగా ఉందని, భద్రగిరి మార్ట్ స్థాపనతో సుమారు డెబ్బై స్వయం సహాయక సంఘాల మహిళలు, ఆర్గానిక్ రైతులు మరియు అటవీ ఉత్పత్తిదారులకు మంచి ఆదాయం లభిస్తున్నదని పేర్కొన్నారు. ప్రజల నుండి ఊహించిన దానికంటే ఎక్కువ స్పందన వస్తోందని చెప్పారు.వినియోగదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, వారు కోరిన నిత్యవసర సరుకులను కూడా అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. సరుకులను కల్తీ లేకుండా అధికారుల పర్యవేక్షణలో గ్రేడింగ్ చేసి, ప్రత్యేక ప్యాకింగ్ మరియు రూపకల్పనతో విక్రయిస్తున్నామని చెప్పారు.భద్రగిరి మార్ట్ నిర్వహణ కోసం ప్రత్యేక సొసైటీని ఏర్పాటు చేసినట్లు, కొనుగోలు–అమ్మకాలు మొత్తం సొసైటీ సభ్యుల ఆధ్వర్యంలోనే జరుగుతున్నాయని వివరించారు. మార్ట్ లో అమ్మే నిత్యవసర సరుకుల్లో తొంభై తొమ్మిది శాతం గిరిజనుల వద్ద నుండి సేకరించినవేనని తెలిపారు. త్వరలో సొరకాయ బొమ్మలు, మట్టి వస్తువులు, ఆకులతో తయారైన ఇస్తరాకులు కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు.ఒక నెలలో ఇంటివద్ద సరఫరా సేవలు ప్రారంభించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, మూడు నెలల్లో పాల్వంచ, ఖమ్మం ప్రాంతాల్లో కూడా భద్రగిరి మార్ట్ శాఖలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. అవసరమైతే ఆర్గానిక్ ఉత్పత్తులను డిమాండ్ కు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ నుంచి కూడా తీసుకురానున్నట్లు చెప్పారు. మార్ట్ కు మరింత ప్రాచుర్యం కల్పించేందుకు ముఖ్య కూడళ్లలో, ముఖ్యంగా దేవస్థాన ప్రాంతంలో ప్రకటన ఫ్లెక్సీలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఇదిలా ఉండగా, భద్రాచలం పట్టణంలో మినీ స్టేడియం నిర్మాణానికి రెండు కోట్లు యాభై లక్షలు మంజూరు కాగా, అదనంగా ఒక కోటి యాభై లక్షలు మంజూరు చేయడానికి క్రీడాశాఖ అంగీకరించిందని తెలిపారు. ఐదు ఎకరాల భూమికి గాను ప్రభుత్వ ఉత్తర్వు కూడా వచ్చిందని, నెల రోజుల్లో శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు.అలాగే, తెలంగాణ రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) చేత ఆదివాసి కోయ ఇలవేల్పుల చరిత్రకు సంబంధించిన గ్రంథాన్ని విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఆదివాసి సంస్కృతి, సంప్రదాయాలపై చర్చా గోష్టి నిర్వహించనున్నట్లు చెప్పారు. గత సంవత్సరం ప్రారంభించిన గిరిజన మ్యూజియంకు రోజురోజుకు సందర్శకుల సంఖ్య పెరుగుతోందని, మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు ఒక కోటి రూపాయల నిధులు విడుదలయ్యాయని, రెండు నెలల్లో రూపకల్పన పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

# వేసవి వేడికి ఉపశమనం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు

- బస్ స్టాప్ వద్ద చలివేంద్రం ప్రారంభం
- గ్రామ ప్రజలకు ఉపయుక్తం
- నూతన ఎమ్మార్వోకు సత్కారం
- పంచాయతీ ప్రతినిధుల అభినందనలు





**అన్నపురెడ్డిపల్లి, ఏప్రిల్ 9, ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి పంచాయతీ పరిధిలోని బస్ స్టాప్ వద్ద వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని పంచాయతీ సర్పంచ్ లాకావత్ లక్ష్మి, మారగాని అశోక్, వార్డు సభ్యులు కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి కాలంలో ప్రయాణికులు, స్థానిక ప్రజలు దాహార్తిని తీర్చుకునేందుకు చలివేంద్రం ఉపయోగపడుతుందని తెలిపారు. బస్ స్టాప్ వద్ద ఏర్పాటు చేయడం వల్ల రోజూ రాకపోకలు చేసే వారికి ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎం జె పి హాస్టల్ ప్రిన్సిపాల్ ఎస్ కే బురాన్, చల్లా రమేష్, దోసపాటి రాంబాబు, గ్రామ పెద్దలు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.చలివేంద్ర ప్రారంభం అనంతరం గ్రామ పంచాయతీ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు కలిసి నూతనంగా ఎమ్మార్వో విధుల్లో చేరిన స్వర్ణను శాలువాతో సత్కరించి స్వీట్లు పంచి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తాసిల్దారు మాట్లాడుతూ మీ అందరి సహాయ సహకారాలతో అన్నపురెడ్డిపల్లి మండలాన్ని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తానని తెలిపారు.గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని పేర్కొన్నారు.

# ఇల్లందు మండల సర్పంచుల సంఘం ఎన్నిక



**ఇల్లందు, ఏప్రిల్ 9, ప్రజాజ్యోతి:** మండలంలోని 29 గ్రామపంచాయతీల సర్పంచులు గురువారం సర్పంచుల సంఘాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలుగా పాయం స్వాతి, ఉపాధ్యక్షుడిగా గుగులోతు నాగార్జున, ప్రధాన కార్యదర్శిగా జరుపుల లక్ష్మణ్, కోశాధికారిగా ఈసం బాలకృష్ణ, సహాయ కార్యదర్శిగా ఈసాల సురేష్, గౌరవ సలహాదారుగా వల్లాల మంగమ్మలను ఎన్నుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య సర్పంచుల సంఘం మండల కమిటీని శాలువాతో ఘనంగా సన్మానించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిత్యం అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు పాయం లలిత, కుంజా సుగుణయ్య, చందావత్ రమేష్ బాబు, అజ్మీరా బిచ్చా, జరుపుల అంజలి, మోకాళ్ళ లావణ్య, అరేం ప్రియాంక, కోటి, శంకర్, సనప సావిత్రి, తాటి యశోద, ఎట్టి రమణ, పూనెం స్వర్ణలత, ముక్తి రమేష్, ముడు సరస్వతి, గోగ్గేల విజయకుమారి, దారావత్ సరోజ, వాంకుడోత్ భారతి, మచ్చా సాయమ్మ, బానోత్ శారదా, భూక్యా అనూష, ధనసరి స్రవంతి, బోడ కిషోర్, మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, మాజీ వైస్ ఎంపీపీ మండల రాము, నాయకులు తాటి బిక్షం, మూతి కృష్ణ పాల్గొన్నారు.

# పేదింటి ఆడబిడ్డకు ప్రభుత్వ అండ

- ఇచ్చిన ప్రతి హామీని అమలు
- 129 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ







**ఇల్లందు, ఏప్రిల్ 9, ప్రజాజ్యోతి:** రాష్ట్రంలోని ప్రతి పేదింటి ఆడబిడ్డ పెండ్లికి ప్రభుత్వం అండగా ఉంటూ నగదు రూపంలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేయడం జరుగుతుందని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. గురువారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి ఒక్క హామీని ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అమలు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. 129 మంది లబ్ధిదారులకు రూ. 1కోటి 29 లక్షల 14వేల 964 ల చెక్కులను అందజేసినట్లు తెలిపారు. గత ప్రభుత్వం మాదిరిగా మాటలతో కాలం వెళ్లి తీసే ప్రభుత్వం తమది కాదని, ప్రజల ఆశీర్వాదాలతో కొలువుతీరిన ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని వర్గాలకు న్యాయం చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్, మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ పెండెల రాజు, తహసిల్దార్ సూర్యనారాయణ, ఆర్ఐలు, మాజీ వైస్ యంపిపి మండల రాము, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మడుగు సాంబమూర్తి, భోళ్ల సూర్యం, కౌన్సిలర్లు, సర్పంచులు, మాజీ సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వెంకటాపురం సమీపంలో రోడ్డు ప్రమాదం ఒకరికి తీవ్ర గాయాలు

- వేగంగా వచ్చిన ద్విచక్ర వాహనం ఢీ... పరిస్థితి విషమం



**అన్నపురెడ్డిపల్లి, ఏప్రిల్ 9, ప్రజా జ్యోతి:** గురువారం ఉదయం సుమారు 9 గంటల సమయంలో అన్నపురెడ్డిపల్లి మండల పరిధిలోగల వెంకటాపురం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. రేగల్లపాడు గ్రామానికి చెందిన వుకే వెంకటేశ్వర్లు సైకిల్‌పై వెళుతుండగా, పాల్వంచ నుండి సత్తుపల్లి వైపు వెళుతున్న ద్విచక్ర వాహనం ఢీకొట్టింది.ఈ ఘటనలో వెంకటేశ్వర్లు తీవ్ర గాయాలకు గురయ్యారు. స్థానికులు వెంటనే 108కు సమాచారం అందించగా, ఈఎంటి కళాధర్, పైలెట్ సురేష్ సంఘటనా స్థలానికి చేరుకొని బాధితునికి ప్రాథమిక చికిత్స అందించి సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.గాయాలు తీవ్రముగా ఉండటంతో వైద్యులు మెరుగైన చికిత్స కోసం ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం బాధితుని పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.ఇటీవల రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని స్థానికులు సూచిస్తున్నారు. వేగ నియంత్రణ పాటించడం, జాగ్రత్తగా వాహనాలు నడపడం ద్వారా ఇలాంటి ప్రమాదాలను నివారించవచ్చని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.ప్రజల ప్రాణ భద్రత దృష్ట్యా అధికారులు రోడ్డు భద్రత చర్యలను మరింత కట్టుదిట్టం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

# భద్రాచలం రవాణా శాఖ కార్యాలయం కొత్త భవనానికి మార్పు



**భద్రాచలం, ఏప్రిల్ 9, ప్రజా జ్యోతి:** భద్రాచలం రెవిన్యూ డివిజన్ పరిధిలో పనిచేస్తున్న రవాణా శాఖ యూనిట్ కార్యాలయాన్ని కూనవరం రోడ్డులోని ప్రస్తుత స్థలం నుంచి కొత్త భవనానికి మార్చినట్లు అధికారులు తెలిపారు. గురువారం నాడు ఐటిడిఏ సముదాయంలోని జీవికా భవనం మొదటి అంతస్తుకు (మొబైల్ కోర్టు పక్కన) కార్యాలయాన్ని తరలించారు.ప్రజలకు మరింత సౌకర్యవంతంగా సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ మార్పు చేపట్టినట్లు రవాణా శాఖ అధికారులు పేర్కొన్నారు. వాహన లెర్నింగ్ లైసెన్స్, డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ తదితర వాహన సంబంధిత సేవల కోసం ఇకపై ప్రజలు కొత్త కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.కొత్త ప్రదేశంలో అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు, సేవలను మరింత వేగవంతంగా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలు ఈ మార్పును గమనించి సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. మోటార్ వాహనాల పరిశీలకుడు సంగం వెంకటపుల్లయ్య మాట్లాడుతూ, కార్యాలయం మార్పు వల్ల సేవల అందింపులో ఎటువంటి అంతరాయం ఉండదని, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందేలా చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు.

# చంద్ర రాజేశ్వర్‌రావుకు ఘన నివాళి

- భూపోరాటాలకు నాంది పలికిన మహానేత సిఆర్



**పాల్వంచ, ఏప్రిల్ 9, ప్రజాజ్యోతి:** దేశవ్యాప్తంగా భూపోరాటాలకు శ్రీకారం చుట్టి నిరుపేద కుటుంబాలకు జీవనోపాధి కల్పించిన మహానేత చంద్ర రాజేశ్వర్‌రావు ధన్యజీవి అని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అడుసుమిల్లి సాయిబాబా, వీసంశెట్టి పూర్ణచంద్రరావు పేర్కొన్నారు.సిపిఐ అగ్రనాయకులు, మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి చంద్ర రాజేశ్వర్‌రావు 33వ వర్ధంతి సందర్భంగా గురువారం పాల్వంచలోని సీఆర్ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ జమీందారి కుటుంబంలో జన్మించినప్పటికీ కమ్యూనిస్టు ఉద్యమాలకు ఆకర్షితుడై తన యావదాస్తిని పేదలకు పంచిన మహానీయుడు చంద్ర రాజేశ్వర్‌రావు అని కొనియాడారు. పేదలకు భూమి దక్కితేనే దేశ అభివృద్ధి సాధ్యమవుతుందని విశ్వసించి దేశవ్యాప్త భూపోరాటాలకు నాంది పలికిన నేతగా ఆయన నిలిచారని పేర్కొన్నారు. పేదల అభ్యున్నతికోసం అహర్నిశలు శ్రమించిన అమర నాయకుల ఆశయాల సాధనకు పార్టీ శ్రేణులు పునరంకితం కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పుశెట్టి రాహుల్, జిల్లా సమితి సభ్యులు అన్నారపు వెంకటేశ్వర్లు, నిమ్మల రాంబాబు, నాయకులు కరీం, అల్లి వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, రామారావు, సంజీవరావు, సయ్యద్ ఇర్ఫాన్, లక్ష్మి, మణి, పద్మ, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# సీజ్ చేసిన ఇసుక వేలం

**బూర్గంపహాడ్,ఏప్రిల్ 9 (ప్రజా జ్యోతి):** బూర్గంపహాడ్ మండలంలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుకను అధికారులు గురువారం బహిరంగ వేలం ద్వారా విక్రయించారు. మండల కేంద్రంలో 25 ట్రాక్టర్ల ఇసుకను రూ.40 వేలకు ఎన్. వెంకటేశ్వర్లు దక్కించుకోగా, నాగినేనిప్రోలు రెడ్డిపాలెంలో 20 ట్రాక్టర్ల ఇసుకను రూ.25 వేలకు పి.సుబ్బారెడ్డి దక్కించుకున్నారు. మొత్తం వేలం ద్వారా ప్రభుత్వానికి రూ.65 వేల ఆదాయం లభించినట్లు అధికారులు తెలిపారు.



## రేగా జన్మదినం సందర్భంగా సాయి బాబా ఆలయానికి బియ్యం వితరణ



**బూర్గంపహాడ్, ఏప్రిల్ 9 (ప్రజా జ్యోతి):** బూర్గంపహాడ్ మండల పరిధిలోని సారపాక శ్రీసాయిబాబా ఆలయంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు జన్మదినం సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గోపిరెడ్డి రమణారెడ్డి ఆధ్వర్యంలో గురువారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తుల అన్నదానం నిమిత్తం 25 కిలోల బియ్యం ప్యాకెట్ వితరణగా అందజేశారు. రానున్న రోజుల్లో రేగా మరిన్ని పదవులు చేపట్టాలని, నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో చల్లగా ఉండాలని సాయిబాబాకు పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో 10వ వార్డు సభ్యులు పాటి అశోక్, మండల యువజన ఉపాధ్యక్షులు ఖాదర్, పట్టణ యువజన అధ్యక్షులు భూక్యా కృష్ణ, బొబ్బిలి, దాసు, రంజిత్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## యాజమాన్యం కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలి

- కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీకి మాజీ జడ్పీటీసీ మద్దతు




**బూర్గంపహాడ్, ఏప్రిల్ 9 (ప్రజా జ్యోతి ):** గత కొన్ని రోజులుగా కాంట్రాక్టు కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం రిలేదీక్షలు చేపడుతున్నా ఐటీసీ యాజమాన్యం పట్టించుకోకపోవడం శోచనీయమని, కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యత ఐటీసీపై ఉందని మాజీ జడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత కార్మిక పక్షాన నిలబడి మద్దతు తెలిపారు. గురువారం 15వ రోజుకు రిలే నిరాహారదీక్షలు చేరడంతో బీఆర్ఎస్ నాయకులతో శిబిరం వద్దకు వెళ్లిన శ్రీలత కార్మికులతో కలిసి రిలేదీక్షల్లో పాల్గొని సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 14 రోజులు పూర్తయినా ఐటీసీ యాజమాన్యం నుంచి ఎలాంటి పిలుపులేదని, కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటే వారిని ఐటీసీ యాజమాన్యం తక్షణమే చర్చలకు పిలవాలన్నారు. ఈ రిలే దీక్షలకు బీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు సానికొమ్ము శంకర్ రెడ్డి, బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం జగదీష్, పట్టణ అధ్యక్షుడు కొనకంచి శ్రీను, యూత్ ప్రెసిడెంట్ సోము లక్ష్మిచైతన్యరెడ్డి, కాంట్రాక్టు కార్మిక సంఘం అధ్యక్షులు కుందూరు పెద్దిరెడ్డి, తాళ్లగొమ్మూరు సర్పంచ్ గుమ్మడి కృష్ణవేణి, బీఆర్ఎస్ నాయకులు చల్లకోటి పూర్ణ, వెంకటరమణ, చట్టు ఆంజనేయులు, సురేష్, శ్రీను, యారం వెంకటరెడ్డి, యక్కంటి నరేష్రెడ్డిలు కార్మికుల దీక్షకు మద్దతు పలికారు. ఈ దీక్షా శిబిరంలో కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ కన్వీనర్ పాటి సోమిరెడ్డి, కో-కన్వీనర్లు సానికొమ్ము రామచంద్రారెడ్డి, బల్లెం నాగయ్య, ఎండీ యాకూబ్పాలతో పాటు జేఏసీ సభ్యులు పాల్గొన్నారు.

## జెకె 5 ఓసి నిర్వాసితులకు న్యాయం చేయాలి

**ఇల్లందు, ఏప్రిల్ 9, ప్రజాజ్యోతి:** జెకె 5 ఓసి కొనసాగింపులో నష్టపోతున్న నిర్వాసితులకు న్యాయం చేసేవరకు అక్కడి నుండి వెళ్లేది లేదని గ్రామపంచాయతీలు తీర్మానం చేశారు. గురువారం జరిగిన రెండు పంచాయతీల గ్రామసభలో సర్పంచులు చాందావత్ రమేష్ బాబు, ధనసరి స్రవంతి లు మాట్లాడుతూ నిర్వాసితులకు న్యాయం జరిగేంతవరకు వారికి అండగా ఉంటామని స్పష్టం చేశారు. తాతలు, తండ్రులు సింగరేణి సంస్థకు సేవలు అందించి పిల్లలుగా వారి కుటుంబ సభ్యులు ఇక్కడే ఇంతకాలం బ్రతకడం జరుగుతుందని గుర్తు చేశారు. తమకు అన్యాయం చేయాలని సింగరేణి సంస్థ చూస్తుందని దీనిని పూర్తిగా ఖండిస్తున్నామన్నారు. ప్రపంచానికి వెలుగులు అందించిన సింగరేణి సంస్థ మా పంచాయతీలకు అన్యాయం చేయాలని చూస్తుందని, 130 ఏళ్ల చరిత్ర ఇల్లందుకు ఉందని, ఈ ఓసితో పాటు తమ ప్రాంతానికి కూడా న్యాయం చేయాలని కోరారు. ఇప్పటికే రైతులు వేసుకున్న పంటలు నాశనం చేసి భూములు తీసుకొని వారిని ఇబ్బందులే గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీడీవో ధన్ సింగ్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఉపాధి హామీ, ఇతర సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచులు ఖాసీం, రేణుక, గ్రామపంచాయతీల వార్డు సభ్యులు, అఖిలపక్ష నాయకులు అబ్దుల్ నబీ, పూనెం సురేందర్, ఎట్టి హరికృష్ణ, తాండ్ర నాగరాజు, గుళ్ల సదా, బొప్పిశెట్టి సత్యనారాయణ, భాస్కర్, వడ్ల శ్రీను, చిన్నారి, ధనసరి రాజు, నాని, విజయ్, ఉపేందర్, గ్రామస్తులు పాల్గొన్నారు.





# ఆరోగ్య భారతాన్ని నిర్మిద్దాం

- ఇల్లందులో చైతన్యవంతంగా సాగిన పోషక పక్వాడ
- కౌన్సిలర్ శివ కిరణ్ ఆధ్వర్యంలో పోషక పక్వాడ





**ఇల్లందు, ఏప్రిల్ 9, ప్రజాజ్యోతి:** నేటి బాలలే రేపటి పౌరులని, వారు శారీరకంగా, మానసిక దృఢత్వంతో ఎదిగినప్పుడే దేశ భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని, ఆరోగ్య భారతాన్ని నిర్మిద్దామని వార్డు కౌన్సిలర్లు కొర్లపాటి శివకిరణ్, చెనిగరపు శృతిలు అన్నారు. గురువారం పట్టణంలోని 22, 24వ వార్డులలో పోషక పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో రక్తహీనత, పోషకాహార లోపం వంటి సమస్యలు నిశ్శబ్ద శత్రువులని పేర్కొన్నారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తాము తీసుకునే ఆహారం పట్ల అత్యంత జాగ్రత్తగా ఉండాలన్నారు. కేవలం కడుపు నింపుకోవడం ఆహారం కాదని, శరీరానికి అవసరమైన విటమిన్లు, ప్రోటీన్లు, ఖనిజ లవణాలు కలిగిన సమతుల్య ఆహారం తీసుకోవడమే అసలైన పోషకాహారం అని తెలిపారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న బలవర్ధకమైన ఆహారాన్ని, ఇతర సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల శుభ్రత పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. చిన్నపిల్లల ఎదుగుదలలో శుభ్రత ప్రధాన పాత్ర పోషిస్తుందని, వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే అవగాహన తప్పనిసరని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం కేవలం ఒక ప్రభుత్వ వేడుకగా కాకుండా, ప్రజల ఆలోచనా దృక్పథంలో మార్పు తేవాలన్నది ప్రధాన ఉద్దేశమని, గర్భిణులు సరైన పోషకాలు తీసుకోకపోతే, అది పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంపై జీవితకాల ప్రభావం చూపుతుందన్నారు. మారుతున్న జీవనశైలిలో జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండి, స్థానికంగా లభించే ఆకుకూరలు, పప్పుధాన్యాలు, పండ్లను స్వీకరించడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించుకోవచ్చని తెలిపారు. ప్రజాప్రతినిధులు స్వయంగా వార్డుల్లో పర్యటిస్తూ ఇలాంటి చైతన్యాన్ని తీసుకురావడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల సమన్వయంతో సాగిన ఈ కార్యక్రమం, ఆరోగ్యకరమైన ఇల్లందు స్థాపనకు ఒక బలమైన పునాదిగా నిలుస్తుందనడంలో సందేహం లేదనేది ప్రజలు అభివర్ణిస్తున్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్వైజర్ గుండె. ధనలక్ష్మి, అంగన్వాడీ టీచర్లు సక్కుబాయి, అరుణకుమారి, సరస్వతి, ఆశా వర్కర్ చెడుపాక కరుణ, స్థానిక మహిళలు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు జన్మదిన వేడుకలు



**బూర్గంపహాడ్,ఏప్రిల్ 9 (ప్రజా జ్యోతి):** బూర్గంపహాడ్ మండలం సారపాకలో బిఆర్ఎస్ పార్టీ టౌన్ అధ్యక్షులు కొనకంచి శ్రీను అధ్యక్షతన బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు,మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ జెడ్పిటిసి కామిరెడ్డి శ్రీలత హాజరై కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బూర్గంపహాడ్ బిఆర్ఎస్ పార్టీ బూర్గంపహాడ్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం జగదీష్, బిఆర్టియూ యూనియన్ అధ్యక్షులు సానికొమ్ము శంకర్ రెడ్డి, టౌన్ అధ్యక్షులు కొనకంచి శ్రీను, టౌన్ యూత్ అధ్యక్షుడు సోములక్ష్మి చైతన్య రెడ్డి, తాళ్ళగుమ్మూరు సర్పంచ్ గుమ్మడి కృష్ణవేణి, బిఆర్ఎస్ మండల నాయకులు పాల్గొన్నారు

## కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లు రద్దుచేసే వరకు పోరాటం కొనసాగిస్తాం

- భగత్ సింగ్,బటు కేశ్వర్ దత్ ల స్ఫూర్తితో పోరాడుదాం




**టేకులపల్లి,ఏప్రిల్09,ప్రజాజ్యోతి:** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చి న కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లు రద్దుచేసే వరకు పోరాటం కొనసాగిస్తామని ఏప్రిల్ 8న ప్రతిజ్ఞ దినంగా పాటించాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్టియు)జాతీయ కమిటీ ఇచ్చిన పిలుపు భాగంగా గురువారం టేకులపల్లి మండలం సింగరేణి కాలనీ లో ఐఎఫ్టియు ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి,నల్ల జెండాలతో నిరసన తెలిపి కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ జీవో కాపీలను దగ్ధం చేయడం జరిగింది.ఈ సందర్భంగా ఐఎఫ్టియురాష్ట్ర నాయకులు డి.ప్రసాద్ ఈ కార్యక్రమంలో పాల్గొని,మాట్లాడుతూ 1929 ఏప్రిల్ 8న బ్రిటిష్ పార్లమెంటు లో షహిద్ భగత్ సింగ్, బట్కేశ్వర్ దత్తులు బ్రిటిష్ప్రభుత్వం తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక రెండు చట్టాలకు నిరసనగా పొగ బాంబులు వేశారని,బ్రిటిష్ సామ్రాజ్య వాదులు దేశంలో కార్మిక పోరాటాలను, ప్రజా పోరాటాలను అణిచి వేసేందుకు నిర్బంధ చట్టాలను ప్రవేశపెట్టిన సందర్భంగా బాంబులను విసిరి బ్రిటిష్ వారిని గడగడలాడించారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. దేశంలో నరేంద్ర మోడీ సర్కార్ పిరికెడు మంది కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసం, పెట్టుబడిదారుల సంపద పెంపు కోసం 50 కోట్ల మంది కార్మికుల రక్త మాంసాలను దోచి పెట్టేందుకు 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్లను తీసుకొచ్చారని విమర్శించారు.కామ్రేడ్స్ షహీద్ భగత్ సింగ్,బట్కేశ్వర్ దత్తుల స్ఫూర్తితో కార్మికవర్గం లేబర్ కోడ్లను రద్దుచేసే వరకు పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఐఎఫ్టియు నాయకులు ప్రభాకర్, బాలాజీ,బాలు, ప్రసాద్, సునీత,ఎర్రమ్మ,కౌసల్య, శివయ్య ,మురళి,నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# భద్రాచలంలో మెగా ఆరోగ్య శిబిరం విజయవంతం


- **బాలికలు, మహిళలకు వైద్య పరీక్షలు**






**భద్రాచలం, ఏప్రిల్ 8, ప్రజా జ్యోతి:** వైజ్ఞ్య రీసెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో "టీన్స్ టు క్వీన్స్" పేరుతో నిర్వహించిన మెగా ఆరోగ్య శిబిరం భద్రాచలం గురుకుల పాఠశాలలో విజయవంతంగా జరిగింది. ఈ కార్యక్రమంలో బాలికలు, మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిసారించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సంజయ్ సింగ్, డాక్టర్ పి. రాజశేఖర్, డాక్టర్ సుబ్బరాజు తదితరులు హాజర య్యారు. డాక్టర్ శ్రావణి గైనకాలజీ నిపుణురాలిగా వైద్య బృందాన్ని నాయకత్వం వహించారు. మహిళల ఆరోగ్యానికి సంబంధించిన శరీర చక్రాల సమన్వయం అంశాన్ని సులభంగా అర్థమయ్యేలా వివరించారు.ఈ శిబిరంలో గర్భాశయ క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు, మహిళల మానసిక ఆరోగ్యం, సహజయోగ సాధన వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఉదయం ఏడు గంటలకు అవగాహన ర్యాలీతో ప్రా రంభమైన కార్యక్రమం దీపప్రజ్వలనతో కొనసాగింది. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, అతిథుల ప్రసంగాలు, సహజయోగ శిబిరం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా సుమారు రెండువందల తొమ్మిది పాప్ స్మియర్ పరీక్షలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామీణ బాలికలు, మహిళల ఆరోగ్య పరిరక్షణలో ఇది ముఖ్యమైన ముందడుగుగా నిలిచిందని పేర్కొన్నారు.మహిళల ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడం, వ్యాధులను ముందుగానే గుర్తించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని వైజ్ఞ్య ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రుద్ర రవి కుమార్ తెలిపారు.సంజయ్ సింగ్ చేతుల మీదుగా "సంజయ్ దృష్టి" అనే కార్యక్రమాన్ని కూడా ఈ సందర్భంగా ప్రకటించారు. పాప్ స్మియర్ పరీక్షల ఫలితాలను సంబంధిత వారికి అందజేస్తున్నట్లు తెలిపారు.చివరిగా జాతీయ గీతంతో కార్యక్రమం ముగిసింది.

## నేడు ప్రపంచ హోమియోపతి దినోత్సవం




**చర్ల, ఏప్రిల్ 09:(ప్రజా జ్యోతి )** :ప్రతి సంవత్సరం ఏప్రిల్ 10న ప్రపంచ హోమియోపతి దినోత్సవం ను హోమియోపతి వైద్యాన్ని కనుగొన్న జర్మన్ వైద్యుడు డాక్టర్ క్రిస్టియన్ ఫ్రెడిక్ శామ్యూల్ హానిమాన్ జన్మదినోత్సవం సందర్భగా జరుపుకుంటారు . ఏప్రిల్ పది న వైద్యరంగానికి హోమియోపతి చేసిన సేవలకు నివాళిగా ప్రత్యామ్నాయ వైద్య విధానం గురించి అవగాహన కల్పించడమే దీని లక్ష్యం.హోమియోపతి అనేది ఒక ప్రత్యామ్నాయ వైద్య విధానం అతి తక్కువ మోతాదులో అనారోగ్యంతో ఉన్నవారిలో చికిత్స అందిస్తారు . ఇది ప్రాచీన గ్రీకు వైద్యానికి చెందినవి అయినప్పటికీ 19వ శతాబ్దంలోనే హోమియోపతి ఐరోపా ఉత్తర అమెరికా అంతటా విస్తృత గుర్తింపు పొందింది.భారతదేశంలో హోమియోపతి వైద్యం పై అవగాహన పరిశోధనను ప్రోత్సహించడానికి భారత ప్రభుత్వం ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ హోమియోపతి దినోత్సవాన్ని జరుపుతారు. హోమియోపతి వైద్యం గురించి ప్రజలలో అవగాహన పెంచడంకని ష్ట దుష్ప్రభావాలపై అవగాహన కల్పించి బహిరంగ కార్యక్రమాలు సెమినార్లను ఏర్పాటు చేసి నేటి వైద్య రంగంలో హోమియోపతి ప్రాముఖ్యతను ప్రజల కు తెలియచేసేందుకు హోమియోపతి దినోత్సవం ఘ నంగా నిర్వహించి ప్రజలలో ప్రత్యామ్నాయ వైద్య విధానం పై అవగాహన కల్పిస్తారు.

## ఐదు గ్రామ పంచాయతీలను తిరిగి భద్రాచలంలో కలపాలి

- **రాష్ట్ర గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు**
- **పాల్గొన్న భద్రాచలం ఎమ్మెల్యే, అఖిలపక్షం నాయకులు**

**భద్రాచలం, ఏప్రిల్ 9, ప్రజా జ్యోతి:** ఆంధ్రాలో కలిసిన ఐదు గ్రామ పంచాయతీలను తిరిగి భద్రాచలంలో కలపాలని , ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లోనే ఇం దుకు సంబంధించిన బిల్లు పెట్టాలని రాష్ట్ర గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు, భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు కోరారు. గురువారం భద్రాచలంలోని హరిత హోటల్లో జరిగిన రాజకీయ అఖిలపక్షం, ఉద్యోగ సంఘం, ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల ఐక్యవేదిక ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ భద్రాచలం మండలం నుంచి విలీనమైన ఐదు గ్రామ పంచాయతీల వలన భద్రాచలంకు సాంకేతిక ఇబ్బందులతో పాటు సరిహద్దు సమస్యలు, పట్టణ విస్తరణతో పాటు భద్రాచలం పట్టణంలోని శివారు ఆంధ్రాలో కలవడంతో ఈ ప్రాత ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. భద్రాచలం చుట్టూ ఎటు చూసినా రెండు కిలోమీటర్ల పరిధిలో ఆంధ్రప్రదేశ్ సరిహద్దు కావడంతో భద్రాచలం అభివృద్ధికి ఇబ్బందిగా మారింది. ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కలిసి ఐదు గ్రామ పంచాయతీలను భద్రాచలంలో కలపాలని కోరారు. భద్రాచలంలో కలిపినట్టు అయితే విస్తీర్ణంతో పాటు అభివృద్ధి కూడా జరుగుతుందని తెలిపారు. ఐదు గ్రామ పంచాతీల సాధనకు ఉద్యమాన్ని భద్రాచలం నుంచి ఢిల్లీ పార్లమెంటు భవనం వరకు తీసుకెళ్లేందుకు ఉద్యమిద్దామని అన్నారు. మరో తెలంగాణ సాధన పోరాటాన్ని గుర్తు చేసేలా ఐదు గ్రామ పంచాయతీల సాధన కమిటీని ఏర్పాటు చేసి భవిష్యత్తు లక్ష్యాలను నిర్దేశించుకొని అఖిలపక్షం సహకారంతో పాటు రెండు రాష్ట్రాల ప్రజల సహకారంతో తీసుకోవాలని అన్నారు. ఇరు రాష్ట్రాల సీఎంలు, కేంద్ర ప్రభుత్వం ఈ విషయంపై ప్రత్యేక దృష్టిసారించాలని అన్నారు. అనేక ఏళ్లుగా నలుగుతున్న ఐదు గ్రామ పంచాయతీల సమస్యను పరిష్కరించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. ఇప్పటికే రాష్ట్ర మంత్రి తుమ్మల ఈ విషయంలో ప్రత్యేక కృషి చేస్తున్నారని ఏపీ సీఎం చంద్రబాబునాయుడతో పాటు, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాను సైతం కలిసారని అన్నారు. ఐదు గ్రామ పంచాయతీలు వస్తేనే భద్రాచలంకు మనుగడ ఉంటుందని, లేదంటే భవిష్యత్తులో పట్టణాభివృద్ధి ఉండదని, ఐదు గ్రామ పంచాయతీల ప్రజలు సైతం విలీనం కోసం ఎదురు చూస్తున్నారన్నారు. త్వరలోనే భద్రాచలంలో ఐదు గ్రామ పంచాయతీల విలీనంపై బహిరంగ సభ పెట్టి అందరిని ఆహ్వానిస్తామన్నారు. ఈ సభలో తీర్మానాలు చేసి కేంద్రానికి పంపుతామని తెలిపారు. ఈ సమావేశంలో సర్పంచ్ పూనెం కృష్ణ, తిప్పన సిద్దులు, గడ్డం స్వామి, వివిధ పార్టీల నాయకులు, స్వచ్ఛంధ సంస్థలు, ఆదివాసీ సంఘాల నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, యూత్ నాయకులు, ఆంధ్రా ప్రాంతం ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



## భద్రాద్రిలో మినీ స్టేడియం ఏర్పాటుకు మార్గం సుగమం

- **ఐదు ఎకరాల స్థలంను కేటాయిస్తూ పత్రాలను క్రీడా శాఖకు అందజేత**



**భద్రాచలం, ఏప్రిల్ 9, ప్రజా జ్యోతి:** భద్రాచలంలో ఐదు ఎకరాల్లో మినీ స్టేడియం ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర క్రీడల శాఖ సిద్ధమైంది. ఇందుకు సంబంధించి స్థలాన్ని కేటాయిస్తూ జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశాల మేరకు భద్రాచలం తహసీల్దారు దనియాల వెంకటేశ్వర్లు గురువారం స్థలం ఎంపిక, హద్దులను గుర్తించి అందుకు సంబంధించిన పత్రాలను భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, సర్పంచ్ పూనెం కృష్ణ సమక్షంలో తహసీల్దారు దనియాల వెంకటేశ్వర్లు జిల్లా క్రీడా శాఖ అధికారి ఎం.పరందామరెడ్డికి అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆ స్థలంలో ఏర్పాటు చేయవలసిన క్రీడా ప్రాంగణాలకు సంబంధించిన వివరాలను మరియు అంచనాలను త్వరలో పూర్తి చేయించి ప్రభుత్వానికి పంపించవలసిందిగా కోరారు. అలాగే గిరిజన ప్రాంత క్రీడకారులకు వీలైనంత తొందరలో ఈ స్టేడియం నిర్మాణానికి తోడ్పడాలని కోరారు. ఈ స్టేడియంకు సంబంధించి ముందుగా క్లీనింగ్ చేపట్టి, కొన్ని క్రీడలు అదేవిధంగా చూడవలసిందిగా కోరినారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డీఈ హరీష్, స్థానిక కోచ్‌లు రామిరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## భద్రాద్రి రామయ్యకు వైభవంగా నిత్యకల్యాణం





**భద్రాచలం, ఏప్రిల్ 9, ప్రజా జ్యోతి:** భద్రాచలంలోని శ్రీ సీతా రామచంద్రస్వామి వారికి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేనార్చన, పుణ్యాహావచనం, కంకణదారణ, యజ్ఞోపవీత దారణ, జీలకరబెల్లం, మాంగల్య దారణ, తలంబ్రాలు, వేద ఆశీర్వచనంను వైదిక బృందం నిర్వహించారు. కల్యాణం అనంతరం కల్యాణంలో పాల్గొన్న జంటలకు శ్రీ సీతారామచంద్రస్వామి వారి మూలవరుల దర్శనంతో పాటు అన్నదాన సౌకర్యం కల్పించారు.

## మంగ్యా తండా స్కూల్లో సరస్వతి విగ్రహం ఆవిష్కరణ

- **ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో టైలు బెల్టులు బ్యాడ్జీలు పంపిణీ**



**టేకులపల్లి,ఏప్రిల్ 09,ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలం బొమ్మనపల్లి స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని మంగ్యాతండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం మంగూలాల్ ఆధ్వర్యంలో గురువారం శ్రీ సరస్వతీదేవి విగ్రహాన్ని టేకులపల్లి ఎంఈఓ జగన్,సర్పంచ్ తారా చంద్,కాంప్లెక్స్ హెచ్ఎం మంగీలాల్ చేతుల మీదుగా విగ్రహాన్ని ఆవిష్కరించారు. గతంలో ఈ పాఠశాలలో పనిచేసి,అకాల మరణం చెందిన టీచర్ ఉమారాణి జ్ఞాపకార్థం ఆమె భర్త కరుణాకర్ రెడ్డి మంగ్యా తండా పాఠశాలలో కృష్ణశిల తో చేసిన శ్రీసరస్వతి అమ్మ వారి విగ్రహాన్ని అందజేశారు. ఇండియన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఫెలోషిప్ (ఎస్జీఎఫ్ ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు లోగాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బెల్టులు,టైలు, బ్యాడ్జీలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో టీచర్ వీరన్న, ఉప సర్పంచ్ కుమార్, పంచా యతీ కార్యదర్శి కృష్ణచైతన్య, సిఆర్పి అబ్బయ్య,ఎస్జీఎఫ్ మెంబర్ నాగభూషణం,ఎండీఎం వర్కర్ అంలీ,స్వచ్ఛ మిత్ర జ్యోతి, గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల10న హజరత్ సయ్యద్ జమాలు ద్దీన్ బీహారి బాబా దర్గా ఉర్సు ఉత్సవాలు

**టేకులపల్లి,ఏప్రిల్ 09,ప్రజాజ్యోతి:** మండలంలోని బేతంపూడి దర్గాలోని హజరత్ సయ్యద్ జమాలు ద్దీన్ బీహారి బాబాను గత డెబ్బై ఏళ్లుగా ముస్లింలతో పాటు హిందువులూ అధిక సంఖ్యలో దర్శించు కుంటున్నారు.ఈ నెల 10వ తేదిన దర్గా ఉత్సవాలు ప్రారంభమవుతాయని దర్గా కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని వెంకట్యాతండా స్టేజీ నుంచి బేతంపూడి మీదుగా వెళ్తే బీహారి బాబా దర్గాను చేరుకోవచ్చు.ఏటా బేతంపూడి దర్గా ఉత్సవాలను దర్గా కమిటీ ఆధ్వర్యంలో మూడు రోజులు ఘనంగా నిర్వహిస్తారు. శుక్రవారం రాత్రి కొత్తగూడెం సూపర్ బజార్ నుంచి పవిత్ర గంధంను మేళతాళాలతో తీసుకొచ్చి దర్గాలో ప్రత్యేక నమాజ్ అనంతరం ప్రతిష్ఠించడంతో ఉర్సు ఉత్సవాలు మొదలవుతాయి.రాత్రి ఖవ్వాలి, అన్నదాన కార్యక్రమాలను అనవాయితీ నిర్వహిస్తున్నారు. ఉత్సవాలకు సమీప మండలాల ప్రజ లతో పాటు ఖమ్మం, మహబుబాబాద్,వరంగల్, హైదారాబాద్ నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటారు అని దర్గా కమిటీ సభ్యులు తెలిపారు.ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు దర్గా కమిటీ ఏర్పాట్లను అంగరంగ వైభవంగా విద్యుత్ దీపాలతో ఏర్పాట్లు చేశారు.

## భద్రాద్రి రామయ్యను దర్శించుకున్న టీజీవో రాష్ట్ర అధ్యక్షులు



**భద్రాచలం, ఏప్రిల్ 9, ప్రజా జ్యోతి:** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని రాష్ట్ర గెజిటేడ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఏలూరి శ్రీనివాస రావు దర్శించుకున్నారు. ఆలయంలో స్వామి వారిని దర్శించుకోవడంతో పాటు లక్ష్మీతాయారు ఆలయం, ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట టీజీవో జిల్లా అధ్యక్షులు సంగం వెంకట పుల్లయ్య, డెక్క నరసింహారావు, గగ్గూరి బాలకృష్ణ, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

## రామకోటి రామరాజు కు భద్రాచలంలో ఘన సన్మానం



**భద్రాచలం, ఏప్రిల్ 9, ప్రజా జ్యోతి:** సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణానికి చెందిన శ్రీరామకోటి భక్త సమాజం సంస్థ అధ్యక్షులు రామకోటి రామరాజును దేవ స్థానం అధికారులు ఘనంగా సత్కరించారు. రామరాజు గత 30యేండ్ల నుండి ప్రతి భక్తునిచే రామకోటి వ్రాపిస్తున్నార్థు వారు భద్రాచల సీతారాముల కళ్యానానికి ప్రతి సంవత్సరం గోటి తలంబ్రాలు అందిస్తుంటారు. ఈ సారి 300కిలోలు అందించారు. గురువారం నాడు భద్రాచల దేవస్థానం ఏఈవో శ్రావణ్ కుమార్ సంస్థ అధ్యక్షులు రామకోటి రామరాజును శాలువాతో ఘనంగా సన్మానించి ముత్యాల తలంబ్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఏఈవో శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ రామకోటి రామరాజు నిస్వార్థ రామ సేవ అమోఘం అన్నారు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ, గ్రామాన తిరిగి గోటితో వడ్లను ఓలిపించి ప్రతి సంవత్సరం సీతారాముల కళ్యాణానికి అందించడం రామకోటి రామరాజు రామభక్తి ఎంత గొప్పదన్నారు. గత 30యేండ్ల నుండి ప్రతి భక్తునిచే రామకోటి రామ నామాన్ని వ్రాయించడం జీవితాన్నే రామునికి అంకితం చేసి అపర రామదాసుగా చరిత్రలో నిలిచిపోయాడన్నారు. ఈ కార్యక్రమం ఆలయ ప్రతినిధులు పాల్గొన్నారు.

## పోతుగంటి క్రాంతికి నివాళులర్పించిన తాటి



**ములకలపల్లి, ఏప్రిల్ 09, ప్రజాజ్యోతి:** ములకలపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు పోతుగంటి క్రాంతి గుండెపోటుతో ఇటీవల మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా గురువారం బూర్గంపహాడ్, అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర తొలి ట్రైకార్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు తాటి వెంకటేశ్వర్లు ములకలపల్లి ప్రెస్ క్లబ్ సభ్యులతో కలిసి తిమ్మపేటలోని క్రాంతి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా క్రాంతి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ములకలపల్లి ప్రెస్ క్లబ్ సభ్యులు బండారు శివ, పువ్వాల శ్రీను, ముదిగొండ శ్రీనివాస్, యాదగిరి, రాము, సురేష్, సుభాష్, ఈశ్వర్ రావు, సాగర్ పాల్గొన్నారు.




## రెవెన్యూ శాఖ అధికారి తీరుపై...

# తీవ్ర విమర్శలు

- అక్రమ మట్టిదందాలో రెవెన్యూశాఖ పాత్రపై అనుమానాలు..!
- నిజం చెప్పినందుకు మహిళ అధికారికి నోటీసుల బెదిరింపులా..?
- రెవెన్యూశాఖే అక్రమాలకు అడ్డాగా మారుతుందా..?
- మట్టిదందాలపై తహసీల్దార్, జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి చేపట్టాల్సిందే
- రెవిన్యూ శాఖ అధికారి తీరుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

**లక్ష్మీదేవిపల్లి మండలం పరిధిలోని ఉమ్మడి చాతకొండ గ్రామపంచాయతీలో అక్రమ మట్టి తవ్వకాల వ్యవహారం తీవ్ర వివాదానికి దారితీస్తోంది. సరైన అనుమతులు లేకుండానే జేసీబీతో మట్టి తొలకలు జరుగుతున్నాయని సమాచారం అందించినప్పటికి సంబంధిత రెవెన్యూ శాఖ అధికారి స్పందించకపోవడంపై స్థానికులు తీవ్ర విమర్శలు వ్యక్తం చేస్తున్నారు.**

● కొత్తగూడెం, ప్రజాజ్యోతి

అనుమతులు లేకుండా జేసీబీతో తవ్వకాలు చేపట్టి సుమారు 100కు పైగా ట్రాక్టర్ల మట్టిని అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం ఉన్నప్పటికీ చర్యలు తీసుకోవాల్సిన రెవెన్యూ శాఖ అధికారి కార్యాలయానికే పరిమితమయ్యారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సమాచారం అందించిన పాపానికి మహిళా అధికారిపై రెవిన్యూ శాఖ అధికారి దురుసుగా ప్రవర్తించడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఇందిరమ్మ ఇండ్ల కోసం మట్టితొలకలు అనే కారణం చూపుతూ అక్రమ తవ్వకాలను అడ్డుకోవద్దని మహిళా అధికారికి రెవిన్యూ శాఖ అధికారి సూచించడం అనేక అనుమానాలకు తావిస్తోంది. మట్టి దందా లో రెవిన్యూ శాఖ అధికారి పాత్రపై అనేక అనుమానాలు తావిస్తుంది. ఈ ఘటనపై మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లక్ష్మీ దేవిపల్లి తహసీల్దార్, జిల్లా కలెక్టర్ వెంటనే విచారణ జరిపి అక్రమ మట్టి రవాణాకు సహకరించిన అధికారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అవసరమైతే సస్పెన్షన్ విధించాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**మహిళా అధికారిపై దురుసు వైఖరి**

తమ గ్రామ పరిధిలో జరిగే అక్రమ మట్టి తొలకలను అడ్డుకోవాలని సంబంధిత అధికారిని కోరినందుకు... ఆగ్రహించిన రెవిన్యూ శాఖ అధికారి ముందు మీ పరిసరాల్లో ఇసుక అక్రమ రవాణా కూడా జరుగుతోంది... ఆ విషయం పై మీకే నోటీసులు ఇవ్వాల్సి వస్తుంది జాగ్రత్త అంటూ హెచ్చరించినట్టు ఆరోపణలు ఉన్నాయి.
నవీన్ అనే వ్యక్తి ఆధ్వర్యంలో మట్టి తొలకలు జరుగుతున్నాయని తెలిసినా మౌనంగా ఉండాలని ట్రాక్టర్లు మట్టిని తీసుకెళ్తే చూసి చూడనట్లు వదిలేయండి అంటూ మహిళా అధికారిపై ఒత్తిడి తీసుకువచ్చినట్లు తెలుస్తుంది. రెవిన్యూ శాఖ అధికారి మాటలు వినకుంటే మహిళా అధికారికి సంబందించిన పై అధికారులకు ఒక్క మాట చెబితే పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని బెదిరించినట్లు తెలుస్తోంది. ఈ పరిణామాల వల్ల ఆ మహిళా అధికారి లోలోపల తీవ్ర ఆవేదనకు గురవుతున్నట్లు సమాచారం.

**రెవెన్యూ శాఖ అధికారి తీరు పై తీవ్ర విమర్శలు**

స్థానిక గ్రామ పంచాయతీకి చెందిన సర్పంచ్, కార్యదర్శులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా జరుగుతున్న అక్రమ మట్టి దందాలకు రెవెన్యూ శాఖ అధికారి అండదండలు ఉన్నాయన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రెవిన్యూ శాఖకు సమాచారం అందించిన మహిళా అధికారిపై దురుసు ప్రవర్తన మాత్రమే కాకుండా ఫిర్యాదు చేసిన వారిని బెదిరించడం కూడా తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. అక్రమ మట్టి దందాలను అరికట్టాల్సిన అధికారి కార్యాలయానికే పరిమితమవుతూ బయట జరుగుతున్న అక్రమాలను నిర్లక్ష్యం చేయడం ద్వారా అనధికార కార్యకలాపాలకు పరోక్షంగా మద్దతు ఇస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండల రెవెన్యూ శాఖలో జరుగుతున్న ఈ తరహా వ్యవహారాలపై స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఇలాంటి అధికారులపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే అక్రమాలకు అధికారిక అనుమతులిచ్చినట్టే అవుతుందని హెచ్చరిస్తున్నారు.
ఉమ్మడి చాతకొండ గ్రామ పంచాయతీ పరిధిలో అనుమతులు లేకుండా అక్రమ మట్టిదందా జరుగుతుందని సమాచారం అందుకున్న రెవిన్యూశాఖ అధికారులు అక్రమ మట్టి దందా నిర్వహించిన వ్యక్తిపై, జేసిబి పై ఎటువంటి చర్యలు చేపట్టారో వేచి చూడాల్సిందే.



# రాష్ట్ర అవార్డులకు జిల్లా కలెక్టర్ సహకారమే ప్రధానం

- ఆసుపత్రుల్లో ఎన్నో సవాళ్లకు పరిష్కారం చూపిన కలెక్టర్
- ఏజెన్సీ ప్రాంత వైద్య సేవల్లో ఇతర ప్రాంతాలకు ఆదర్శంగా భద్రాద్రి జిల్లా
- కృతజ్ఞతలు తెలిపిన ఆసుపత్రి సూపరింటెండెంట్లు



**కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 9,(ప్రజా జ్యోతి)** 99రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రాష్ట్ర స్థాయిలో ప్రదానం చేసిన అవార్డుల్లో సుమారు 20 శాతం అవార్డులు జిల్లా టీవీవీపీ ఆసుపత్రులకు దక్కిన సందర్భంగా ఆయా ఆసుపత్రుల సూపరింటెండెంట్లు గురువారం పాల్వంచలోని కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ అంకిత్ ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూనాటి జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ నుండి నేటి జిల్లా కలెక్టర్ అంకిత్ వరకు సంపూర్ణ మద్దతు, సహకారం వల్లనే ఈ విజయాలు సాధ్యమయ్యాయని సూపరింటెండెంట్లు స్పష్టం చేశారు. వివిధ సమావేశాల్లో పలువురు ఎమ్మెల్యేలు, మంత్రులు సూచించిన అంశాలను ముందుండి అమలు చేయడంలో కలెక్టర్ కీలక పాత్ర పోషించినట్లు తెలిపారు. ఆయన ముందడుగు, నిరంతర సహకారం సిబ్బందికి నైతిక బలం ఇచ్చి మెరుగైన ఫలితాలు సాధించడానికి దోహదపడిందన్నారు. సమయానుకూల ప్రణాళిక, ప్రోత్సాహం సిబ్బందిలో వృత్తి పట్ల నిబద్ధత పెంపొందించగా, ఆర్థిక పరిమితులు ఉన్నప్పటికీ దూరప్రాంతాల్లో ఆరోగ్య సేవలు, వసతులు, ప్రమాణాల మెరుగుదలకు జిల్లా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ, చొరవ చూపినట్లు పేర్కొన్నారు.గత సంవత్సరం నర కాలంగా దూరప్రాంతాలు, గిరిజన ప్రాంతాల్లో ఆరోగ్య సేవలను బలోపేతం చేయడానికి విస్తృత చర్యలు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో చేపట్టినట్లు తెలిపారు. ఈ క్రమంలో రక్త నిల్వ కేంద్రాల స్థాపన, ఆపరేషన్ థియేటర్ల అభివృద్ధి, నిపుణులైన వైద్యులను ప్రోత్సాహకాలతో నియామకం, డయాలిసిస్ కేంద్రాల ఏర్పాటు, ఓ పి డి , ఆపరేషన్ థియేటర్ పరికరాల సమీకరణ, డిజిటల్ ఎక్స్–రే, ఈ సి జి యంత్రాల ఏర్పాటు, ఆసుపత్రుల మరమ్మత్తులు, పునరుద్ధరణ, సి సి కెమెరాలు, తాగునీటి సౌకర్యాలు, డైట్, శానిటేషన్ సదుపాయాలు, వార్డుల్లో ఏసి కూలర్లు తదితర మౌలిక వసతులు మెరుగుపరచబడినట్లు వివరించారు.ఈ చర్యల ఫలితంగా అవుట్ పేషెంట్, ఇన్ పేషెంట్ రోగుల సంఖ్య గణనీయంగా పెరిగి, ఆసుపత్రుల్లో పడకలు సరిపోని స్థితి ఏర్పడినట్లు తెలిపారు. ప్రసవాలు, శస్త్రచికిత్సలు భారీగా పెరిగి, టోటల్ నీ రీప్లేస్ మెంట్, ల్యాపరోస్కోపిక్ వంటి స్పెషాలిటీ సేవలు విజయవంతంగా నిర్వహించబడుతున్నట్లు పేర్కొన్నారు . క్లిష్ట కేసులను స్థానికంగానే నిర్వహించడం వల్ల రిఫరల్ కేసులు గణనీయంగా తగ్గినట్లు తెలిపారు.ఈ కృషికి రాష్ట్ర ప్రభుత్వం నుండి గతం లో సైతం గుర్తింపు లభించడంతో పాటు ఐటీడీఏ పీవో, రాష్ట్ర టీవీ విపి కమిషనర్, ఆరోగ్య కార్యదర్శి, ఆరోగ్య మంత్రి, తదితర ఉన్నతాధికారుల నుండి ప్రశంసలు అందినట్లు తెలిపారు. స్థానిక శాసన సభ్యులు కూడా తెలంగాణ శాసనసభలో ఈ సేవలను అభినందించడం చారిత్రాత్మక ఘట్టం గా పేర్కొన్నారు.ఈ సందర్భంగా జిల్లా పరిధిలోని ఆసుపత్రుల సూపరింటెండెంట్లు జిల్లా కలెక్టర్ కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ రవి బాబు, ఆసుపత్రి సూపరింటెండెంట్లు డాక్టర్ రామకృష్ణ, రామ్ ప్రసాద్, గౌరీ ప్రసాద్, హర్షవర్ధన్, జీజీహెచ్ సూపరింటెండెంట్ రాధ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలి



**ములకలపల్లి, ఏప్రిల్ 09,ప్రజాజ్యోతి :** కొత్తగూడెంలో జరిగే తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ పిలుపునిచ్చారు. స్థానిక కార్యాలయంలో లక్ష్మీ నరసయ్య అధ్యక్షతన జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ, అఖిల భారత కిసాన్ సభ ఏఐకెఎస్ స్వాతంత్ర్యం పూర్వం నుంచే రైతుల హక్కుల కోసం పోరాడుతున్న ఏకైక సంఘమని తెలిపారు. 1936 ఏప్రిల్ 11న లక్నోలో స్థాపించబడిన ఈ సంఘం అప్పటి నుంచి నేటి వరకు రైతాంగ సమస్యలపై నిరంతరం ఉద్యమాలు కొనసాగిస్తోందన్నారు. రాష్ట్రంలో తెలంగాణ రైతు సంఘం రైతుల సమస్యలపై ముందుండి పోరాడుతోందని, గిట్టుబాటు ధరలు, పంట బీమా, రుణమాఫీ వంటి ప్రధాన అంశాలపై రైతులను సమీకరిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న విద్యుత్ సవరణ చట్టం వల్ల రైతులకు తీవ్ర నష్టం కలిగే ప్రమాదం ఉందని, బోర్లపై ఆధారపడిన వ్యవసాయం కష్టాల్లో పడే అవకాశముందని చెప్పారు. ఈ నెల 23, 24, 25 తేదీల్లో కొత్తగూడెంలో జరిగే రాష్ట్ర మహాసభల్లో రైతుల సమస్యలపై చర్చించి తీర్మానాలు తీసుకుని భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. మహాసభలను విజయవంతం చేయాలని రైతులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి కొండబోయిన వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి ఊకంటి రవికుమార్, నాయకులు గోపగాని లక్ష్మీనరసయ్య, పుప్పాల హరినాథ్, హేమాని, బైరు ప్రసాద్, భుక్యా శ్రీదేవి, గడ్డం వెంకటేశ్వర్లు, పెంకె భద్రం, సున్నం నాగులు తదితరులు పాల్గొన్నారు.

## పోటు రంగారావుపై అక్రమ కేసులు ఎత్తివేయాలి




**ములకలపల్లి ఏప్రిల్ 09, ప్రజాజ్యోతి:** సిపిఐ (ఎంఎల్ ) మాస్ లైన్ ప్రజా పంథా రాష్ట్ర8 కార్యదర్శి పోటు రంగారావుపై దేశద్రోహం, ఉపా కేసులు నమోదు చేసి ఎన్ఐఏ నోటీసులు జారీ చేయడాన్ని ఖండిస్తూ ములకలపల్లి మండల కేంద్రంలో సంయుక్త మండల కమిటీల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నూపా భాస్కర్ మాట్లాడు తూ, ప్రజాస్వామ్య పోరాటాలు చేస్తున్న నాయకుడిపై కేసులు పెట్టడం అన్యాయమని పేర్కొన్నారు. వెంటనే కేసును, ఎన్ఐఏ నోటీసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కల్లూరి కిషోర్, కొర్సా రామకృష్ణ, నకిరేకంటి నాగేశ్వరరావు, శాస్త్రబోయిన వెంకటేశ్వర్లు, బండారు నాగేంద్రబాబు, ఎర్రగొర్ల రామారావు, కల్లూరి పద్మ, కోర్సా ఆదిలక్ష్మి, పోడియం రాజు, పోడి యం బండి, మడకం కొస తదితరులు పాల్గొన్నారు.

## అన్నపురెడ్డిపల్లి మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

- సన్నాలకు మద్దతు ధరతో పాటు బోనస్





**అన్నపురెడ్డిపల్లి, ఏప్రిల్ 9,ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గల అన్నపురెడ్డిపల్లి, జానకిపురం, కట్టుగూడెం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ప్రారంభించారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని, ప్రతి గింజను కొనుగోలు చేస్తామని తెలిపారు.తులకు ప్రకటించిన మద్దతు ధర అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. దళారుల జోక్యం లేకుండా రైతుల ఖాతాల్లోనే నేరుగా నగదు జమ చేసే విధానం అమలులో ఉందన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద తాగునీరు, నీడ వంటి సౌకర్యాలు కల్పించాలని సిబ్బందికి సూచించారు. ధాన్యం నాణ్యత పరిశీలనలో రైతులకు అన్యాయం జరగకుండా చూడాలని, తేమ శాతం విషయంలో నిబంధనలు పాటించాలని చెప్పారు. గతంలో రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈసారి సకాలంలో కొనుగోలు ప్రక్రియ చేపడుతున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, మండల అధికారులు, పౌరసరఫరాల శాఖ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే కోరం కనకయ్య





**టేకులపల్లి,ఏప్రిల్09,ప్రజాజ్యోతి:** మండలంలోని బోడు గ్రామంలో బేతంపూడి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లి (పిఏసిఎస్ ) ఆధ్వర్యంలోగురువారం వరిధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే కోరం కనకయ్య ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో మండల కేంద్రమైన టేకులపల్లిలో మాత్రమే కొనుగోలు కేంద్రం ఉండేదని, రైతులకు రవాణా ఇబ్బందులు ఉండకూడదు అనే ఉద్దేశంతో బోడు గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయటం జరిగిందని ఆయన అన్నారు.వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు సహకారంతో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసుకున్నామని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. రైతులకు వ్యవసాయ పనిముట్లు సబ్సిడీ, వడ్లకు బోనస్, మద్దతు ధర కల్పిస్తున్నామని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల ఏవో అన్నపూర్ణ ,సీఈఓ చారీ, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరం సురేందర్ , ఆత్మ కమిటీ చైర్మన్ బోడ మంగీలాల్ ,బోడు సర్పంచ్ పోదెం స్వరూప,సర్పంచులు సురేష్, కోరం హనుమంతు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈది గణేష్, పోశాలు,రమేష్,సర్దార్,వేణు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇల్లుకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కోరం కనకయ్య



**టేకులపల్లి,ఏప్రిల్ 9, ప్రజాజ్యోతి:** మండలంలోని గోలియా తండా పంచాయతీకి చెందిన లబ్దిదారి సుజాత ఇందిరమ్మ ఇళ్ళు శంకుస్థాపన గురువారం ఎమ్మెల్యే కోరం కనకయ్య చేశారు.ఆయన మాట్లాడుతూ ప్రతి పేదవారికి క్యాటగిరి వైజ్ గా ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ళను లబ్ధిదారులకు అందించడం జరుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు.కొంచెం ఆలస్యమైనా ప్రతి లబ్ధిదారుడికి ఇందిరమ్మ ఇళ్ళను మంజూరు చేస్తామని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరం సురేందర్ , హౌసింగ్ ఏఈ గణేష్ ,ఆత్మ కమిటీ చైర్మన్ బోడ మంగీలాల్ ,గోలియా తండా సర్పంచ్ నాకా నాయక్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## రామవరానికి యుద్ధ ప్రాతిపదికన నీటి సరఫరా అవసరం



**చుంచుపల్లి, ఏప్రిల్ 9 ( ప్రజాజ్యోతి )** రామవరం ప్రాంతంలో తక్షణమే మంచి నీటి సరఫరా చేపట్టాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. షాబీర్ పాషా డిమాండ్ చేశారు. గురువారం ఆయన సిపిఐ బృందంతో కలిసి కిన్నెరసాని, మిషన్ భగీరథ పైప్‌లైన్ పనులు, నూతన ట్యాంకులను పరిశీలించారు. అధికారుల అలసత్వం కారణంగా మిషన్ భగీరథ పనులు జాప్యం అవుతున్నాయని ఆయన విమర్శించారు. రూ.125 కోట్లతో మంజూరైన ఈ పథకాన్ని త్వరగా పూర్తి చేసి ప్రజలకు నీటి సమస్యలు పరిష్కరించాలని కోరారు. నూతన ట్యాంకును వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని పాత కిన్నెరసాని ట్యాంక్ ద్వారా తాత్కాలికంగా నీటి సరఫరా కొనసాగించాలని సూచించారు. నీటి అంతరాయం లేకుండా స్టాండ్‌బై మోటార్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. పైప్‌లైన్ పనుల వల్ల దెబ్బతిన్న రోడ్లను వెంటనే మరమ్మతు చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను కోరారు.

## హెచ్ఐవి అవగాహన ర్యాలీ నిర్వహణ

- **ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా విద్యార్థుల పాల్గొనిక**






**కొత్తగూడెం, ఏప్రిల్ 9 ( ప్రజాజ్యోతి )** ఆరోగ్య వారోత్సవాల సందర్భంగా ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కింద భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో హెచ్ఐవి /ఎయిడ్స్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.తుకారాం రాథోడ్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. పాత డిపో నుంచి ప్రారంభమైన ర్యాలీ కొత్తగూడెం రైల్వే స్టేషన్ వరకు సాగింది. ఈ సందర్భంగా విద్యార్థులు హెచ్ఐవి/ఎయిడ్స్‌పై నినాదాలు చేస్తూ ప్రజల్లో చైతన్యం కల్పించారు. ర్యాలీ అనంతరం జరిగిన సమావేశంలో డా. తుకారాం రాథోడ్ మాట్లాడుతూ హెచ్ఐవి/ఎయిడ్స్‌తో పాటు హెపటైటిస్ బి, సి వ్యాధులపై అవగాహన అవసరమని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్య స్థితిని తెలుసుకోవాలని, ముఖ్యంగా వివాహానికి ముందు హెచ్ఐవి పరీక్ష చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచిత పరీక్షలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. డి. ప్రసాద్ మాట్లాడుతూ హెచ్ఐవి బాధితులపై ఉన్న వివక్షను తొలగించాల్సిన అవసరాన్ని వివరించారు. యువతలో అవగాహన పెంపు కీలకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ విద్యార్థులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, వివిధ శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

# మండలంలో ఎమ్మెల్యే జారే విస్తృత పర్యటన

- **పలు అభివృద్ధి పనులకు శ్రీకారం**

**ములకలపల్లి, ఏప్రిల్ 9 ప్రజాజ్యోతి:** అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ గురువారం మండలంలో విస్తృతంగా పర్యటిస్తూ పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ముందుగా రామచంద్రాపురం, చాపరాలపల్లి గ్రామాల్లో ప్రభుత్వ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. అనంతరం పేదలకు మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. కుమ్మరిపాడు గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అలాగే గుట్టగూడెం గ్రామంలో పూర్తయిన ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమం లో పాల్గొన్నారు.





ద్వాక్రా మహిళల కోసం సమావేశ మందిరం (వీవో బిల్డింగ్) నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. మాదారం గ్రామంలో గ్రామపంచాయతీ కార్యాలయం మరియు సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. చివరగా ఎంపీడీవో కార్యాలయం ప్రాంగణంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేసి, మండల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. పర్యటనలో భాగంగా అనారోగ్యంతో బాధపడుతున్న పలువురిని పరామర్శించారు.

ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి శ్రీ రమేష్, తహశీల్దార్ భాగ్యలక్ష్మి, ఎంపీడిఓ డి. రామారావు ఎంపిఓ పి రమేష్, పి ఆర్ ఏఈ శ్రీనివాసరావు, ఆర్ డబ్యూ ఎస్ ఏ ఈ ప్రసాద్, హౌసింగ్ ఏఈ శ్రీధర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు బత్తుల అంజి, తాండ్ర ప్రభాకరరావు, కారం సుదీర్, గాడి తిరుపతి రెడ్డి, శనగపాటి రవి, సురభి రాజేష్, కరుటూరు కృష్ణ, సర్పంచులు, ఉపసర్పంచులు, కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు

## రెండో రోజుకు చేరిన విద్యుత్ ఆర్టిజన్ ఉద్యోగులు సమ్మె



**కొత్తగూడెం, ఏప్రిల్ 9 ( ప్రజాజ్యోతి )** రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ ఆర్టిజన్ ఉద్యోగులు చేపట్టిన సమ్మె రెండో రోజుకు చేరుకుని ఉధృతంగా కొనసాగింది. తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు భద్రాద్రి కొత్తగూడెం డివిజన్ కార్యాలయం ముందు కార్మికులు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. ఈ సమ్మెలో ఆర్టిజన్స్, అన్మాండ్స్ కలిపి మొత్తం 104 మంది కార్మికులు పాల్గొన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా కన్వీనర్ కూనూరాజు శ్రీనివాసు, డివిజన్ చైర్మన్ మోతిరామ్, కన్వీనర్ రాంబాబు, కో–కన్వీనర్ రాజేందర్ తదితరులు హాజరయ్యారు. కార్మికులు తమ ప్రధాన డిమాండ్లను వెల్లడిస్తూ ఆర్టిజన్స్‌ను విద్యార్హతల ఆధారంగా కన్వర్షన్ చేయాలని ఏపీ ఎస్ సి బి సర్వీస్ రూల్స్ అమలు చేయాలని కోరారు. అలాగే అన్మాండ్స్‌ను ఆర్టిజన్స్‌గా గుర్తించి, పీస్ రేట్ కార్మికులకు జీఓ నెం.11 ప్రకారం కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమ్మెకు పలు కార్మిక, రాజకీయ, ఉద్యోగ సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు సమ్మె కొనసాగిస్తామని నాయకులు స్పష్టం చేశారు.

# ఆవాస విద్యాలయాల తనిఖీలో లోపాలు బహిర్గతం

- **ఎంఈఓకు షోకాజ్ నోటీస్ జారీకి కలెక్టర్ ఆదేశం**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 09, ప్రజా జ్యోతి:** జిల్లాలోని ఆవాస విద్యాలయాల నిర్వహణలో ఉన్న లోపాలపై జిల్లా కలెక్టర్ అంకిత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పాతకొత్తగూడెంలో సమగ్ర శిక్ష పరిధిలో నడుస్తున్న నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆవాస విద్యాలయం, పట్టణ బాలుర ఆవాస విద్యాలయంలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీ సందర్భంగా కలెక్టర్ ఏడవ తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న సౌకర్యాలు, భోజనం, ఆహార నాణ్యతపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థుల ఇంగ్లీష్ పఠన సామర్థ్యాన్ని పరీక్షించి వారి ప్రదర్శన పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు.విద్యార్థులు సరిగా చదవలేకపోవడానికి గల కారణాలపై ప్రిన్సిపాల్ ను ప్రశ్నించిన కలెక్టర్, బోధనలో లోపాలు





ఎందుకు ఉన్నాయో వివరణ కోరారు. పట్టణ స్థాయి పాఠశాల అయినప్పటికీ విద్యార్థుల సామర్థ్యం తక్కువగా ఉండటం ఆందోళనకరమని తెలిపారు. స్టోర్ రూమ్ ను పరిశీలించిన కలెక్టర్, అవసరమైన సరుకులు తగినంతగా లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ సరఫరాలో లోపాలు ఎందుకు ఉన్నాయో సంబంధిత అధికారులను ప్రశ్నించారు. అనంతరం వంటశాలను పరిశీలించిన ఆయన పరిశుభ్రత లోపాన్ని గమనించి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు అందించే ఆహారం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోదని హెచ్చరించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది హాజరు రిజిస్టర్ ను పరిశీలించిన కలెక్టర్, పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బంది ఎక్కువగా కాంట్రాక్టు పద్ధతిలో ఉన్నట్లు గమనించారు. ఈ పరిస్థితుల్లో విద్యార్థుల అభ్యాసంపై ప్రభావం పడకుండా బాధ్యతతో పనిచేయాలని సూచించారు. ఈ పాఠశాలలో వీధి బాలలు, రక్షిత బాలలు, డ్రాప్ అవుట్ విద్యార్థులు చదువుతున్నందున వారికి ప్రత్యేక శ్రద్ధ అవసరమని పేర్కొన్నారు. అయితే పర్యవేక్షణలో స్పష్టమైన లోపాలు కనిపిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ నేపథ్యంలో సంబంధిత ఎంఈఓకు షోకాజ్ నోటీస్ జారీ చేయాలని అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. పాఠశాలల నిర్వహణ, బోధన ప్రమాణాలు, విద్యార్థుల సంక్షేమంపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ తనిఖీలో కలెక్టర్ వెంట పాఠశాల ప్రిన్సిపాల్ రాంబాయి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.